క్లుప్తంగా

అన్నదానం


రుయా వద్ద అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

తిరుపతి తుడా : పుట్టపర్తి సాయిబాబా జయంతిని పురస్కరించుకుని అద్వైత అవేర్‌నెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం చేశారు. రుయా ఆస్పత్రి ప్రాంగణం, అలిపిరిలో రోగులు, యాత్రికులకు అన్నదానం చేపట్టారు. పుట్టపర్తి సాయిబాబా చిత్రపటానికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు సుజన్ కుమార్, కార్యనిర్వాహకుడు రత్నరాజు పాల్గొన్నారు.

వందేళ్ల వేడుకకు సన్నద్ధం


మాట్లాడుతున్న హరినాథరెడ్డి

తిరుపతి కల్చరల్ : సీపీఐ వందేళ్ల వేడుకకు శ్రేణులు సన్నద్ధం కావాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్యభవన్‌లో తిరుపతి, చంద్రగిరి, పుత్తూరు నియోజవర్గాల పార్టీ శాఖ కార్యదర్శుల వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు పదును పెట్టాలని కోరారు. డిసెంబర్ 26వ తేదీకి సీపీఐ వందో సంవత్సరంలో అడుగుపెడుతోందని తెలిపారు. సమావేశంలో నేతలు రాజశేఖర్, విశ్వనాథ్, చంద్రశేఖర్, రాధాకృష్ణ, శ్రీరాములు, గోవిందస్వామి, మణి, మునికృష్ణ, నాగభూషణం, కవిత, చంద్రకళ, హరిత, రాంబాబు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో దేశసేవకు అవకాశం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

పాకాల : విద్యార్థులు ఎన్‌సీసీ ద్వారా దేశానికి సేవ చేసే అవకాశం పొందవచ్చని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మొహిద్దీన్‌బాషా తెలిపారు. శనివారం 76వ ఎన్‌సీసీ దినోత్స వం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఐకమత్యం, నాయకత్వం లక్షణాలు పెంపొందుతాయన్నారు. ఎన్‌సీసీ లెఫ్టినెంట్ డాక్టర్ ఈశ్వర్‌బాబు మాట్లాడుతూ నేషనల్ డిఫెన్స్ అకాడమీ ద్వారా ఉపాధి అవకాశాలను వివరించారు. అనంతరం క్యాడెట్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్‌కుమార్, మోహన్ బెహారా, రమణమ్మ పాల్గొన్నారు.

అశోక్‌ను ఆదరించండి


గల్లా అరుణకుమారి

చంద్రగిరి : దేవకీ నందన వాసుదేవ చిత్రం కోసం అశోక్ కష్టపడ్డారని, ఆదరించాలని మాజీమంత్రి గల్లా అరుణకుమారి కోరారు. శనివారం చంద్రగిరి ఎస్వీ సినిమాస్‌లో కుటుంబ సభ్యులు, అభిమానులతో కలిసి దేవకీ నందన వాసుదేవ చిత్రం వీక్షించారు. ఆమె మాట్లాడుతూ అశోక్ డ్యాన్స్, యాక్షన్ బాగా చేశాడని ప్రశంసించారు. చిత్రానికి పాజిటివ్ టాక్ రావడంతో పబ్లిసిటీని పెంచనున్నట్లు వెల్లడించారు. తాను రాజకీయాల నుంచి రిటైర్డ్ అయ్యానని, కుటుంబీకుల ప్రవేశంపై ప్రస్తుతం ఏమీ చెప్పలేని వివరించారు.

దళిత కాపు సంక్షేమానికి సహకారం

తిరుపతి సిటీ : దళిత కాపు సంక్షేమానికి సహకారం అందిస్తామని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. శనివారం ఎస్వీయూ సెనెట్ హాల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేను దళిత కాపు అసోసియేషన్ నేతలు కలిశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంగుకూరు శివ, కార్యదర్శి ముని నరేంద్రయాదవ్, నేతలు జయరామయ్య, వంశీ వర్ధన్, ఆనంద్ పాల్గొన్నారు.

బీఓఎస్ చైర్‌పర్సన్‌గా శిరీష



తిరుపతి సిటీ : ఎస్వీయూ సంస్కృత శాఖ అధ్యాపకులు ప్రొఫెసర్ గుండ్లపల్లి శిరీష బీఓఎస్ చైర్‌పర్సన్ గా నియమితులయ్యారు. శనివారం ఈ మేరకు వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఉత్తర్వులు అందజేశారు.

రోగులకు మెరుగైన వైద్యం

పాకాల : ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి డాక్టర్ హర్షవర్ధన్‌రావు ఆదేశించారు. శనివారం దామలచెరువు పీహెచ్‌సీ పరిధిలోని బందార్లపల్లె ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ రవిరామ్, ఎస్‌ఓ నాగేంద్రకుమార్, సూపర్‌వైజర్ నరేషబాబు, డీపీఓ ప్రకాష్ పాల్గొన్నారు.

నోటిఫికేషన్ విడుదలకు డిమాండ్

తిరుపతి సిటీ : ఎస్వీయూలో టీచింగ్ అసిస్టెంట్ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని బీజేపీ నేత కల్లూరు విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ వీసీ, రిజిస్ట్రార్ తక్షణమే అధ్యాపక నియామకాలపై దృష్టి సారించాలని, లేకుంటే ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

గ్యారేజ్ సెంటర్ పక్కన చెత్త కుప్ప



ఆటోనగర్‌లో డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్న వీధి



పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

తిరుపతి కార్పొరేషన్ అధికారులు నగర శివారు ప్రాంతాలపై శీతకన్ను వేస్తున్నారు. తూతూమంత్రంగా పారిశుద్ధ్య నిర్వహణ చేపడుతున్నారు. స్వచ్ఛసర్వేక్షణ్‌లో ర్యాంకుల మోజులో పడి తిరుపతి పరిసరాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆటోనగర్‌లో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసింది. చెత్త కుప్పల నిలయంగా మారిపోయింది. దీనికి గ్యారేజీ నిర్వాహకుల అలసత్వం కూడా తోడవుతోంది. ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలను పడేస్తుండడంతో పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. దీంతో కాలనీవాసులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. పేరుకున్న చెత్త నుంచి వెలువడే దుర్వాసనతో రోగాల బారిన పడుతున్నారు.

- ఆటోనగర్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు
- ఎక్కడ పడితే అక్కడ చెత్త పడేస్తున్న గ్యారేజ్ నిర్వాహకులు
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు
- నానా అవస్థలు పడుతున్న స్థానికులు

తిరుపతి తుడా : తిరుపతి నగర శివారు ప్రాంతం ఆటోనగర్ లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. ప్రజా ఆరోగ్య శాఖ యంత్రాంగ నిర్లక్ష్యం... గ్యారేజ్ నిర్వాహకుల బాధ్యతారాహిత్యం ఆటోనగర్‌కు శాపంగా మారింది. దీంతో స్వచ్ఛ తిరుపతి లక్ష్యం నీరుగారుతోంది. పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నా కొన్ని ప్రాంతాల్లో ఆ సమస్యకు నేటికీ పరిష్కారం దొరకడం లేదు. ఆయా చోట్ల విధులు నిర్వర్తిస్తున్న శానిటరీ సిబ్బంది నిర్లక్ష్యమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య , హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ నగర శివారు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం కనిపిస్తోంది.

ప్రజా ఆరోగ్యశాఖ నిర్లక్ష్యం

నగర పారిశుద్ధ్య నిర్వహణ కోసం మున్సిపల్ కార్పొరేషన్ రూ.కోట్లు వెచ్చిస్తోంది. స్వచ్ఛ నగరాల్లో తిరుపతికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో ఎప్పటికప్పుడు ఆధునిక విధానాల్లో చర్యలు చేపడుతున్నా ఆ స్థాయిలో ఫలితం మాత్రం కనిపించడం లేదు. ఇందుకుకిందిస్థాయిలో పనిచేసే సిబ్బంది అలసత్వమే కారణంగా కనిపిస్తోంది. వర్కర్లను అనధికారిక సెలవులపై పంపించడం. తద్వారా పూర్తిస్థాయిలో కార్మికుల హాజరు చూపించి ఆ వేతనాలను దోచుకోవడం.. అలాగే దుకాణదారులు నెలవారీ మామూళ్లు ఇవ్వకుంటే క్షేత్రస్థాయిలో చెత్తను సేకరించకపోవడం వంటి కారణాల వల్ల పారిశుద్ధ్య నిర్వహణ గాడి తప్పింది. ఆటోనగర్‌లో పారిశుద్ధ్య నిర్వహణ కోసం ఏపీఐఐసీ ఏటా మున్సిపల్ కార్పొరేషన్‌కు అధికారికంగా చెత్త పన్ను చెల్లిస్తోంది. అయినా ఆటోనగర్‌లోని చాలా దుకాణాలు, గ్యారేజీ సెంటర్ల నుంచి శానిటరీ సిబ్బంది అనధికారికంగా నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారు. ఎవరైనా సకాలంలో సొమ్ము ఇవ్వకుంటే అక్కడ చెత్త సేకరణను నిలిపివేస్తున్నారు. దీంతోనే టన్నులకొద్దీ వ్యర్థాలు ఆటోనగర్ పేరుకుపోయాయి.


ఇళ్ల మధ్య చెత్త కుప్ప

గ్యారేజ్ సెంటర్ల బాధ్యతారాహిత్యం

ఆటోనగర్ లో అత్యధికంగా గ్యారేజీలు, సంబంధిత హోల్ సేల్ సెంటర్లు, దుకాణాలు ఉన్నాయి. ఆటోనగర్ కి పడమటి వైపు అధిక సంఖ్యలో నివాసాలు ఉన్నాయి. ఇక్కడి నుంచి ప్రతి రోజు 10 నుంచి 15 టన్నుల వరకు చెత్త ఉత్పత్తి అవుతోంది. ఈ చెత్తను నిత్యం శానిటరీ సిబ్బంది తరలించాల్సి ఉంది. అయితే ఆ దిశగా నిర్వహణ వ్యవస్థను సంబంధిత శాఖ యంత్రాంగం పర్యవేక్షించడం లేదు. ఇదిలా ఉంటే గ్యారేజీ నిర్వాహకులు తీరు బాధ్యతరాహిత్యంగా మారింది. ప్రతిరోజు తమ వద్ద ఉత్పత్తి చెత్తను సమీపంలోనే పడేస్తున్నారు. అక్కడ నుంచి చెత్తను తరలించడం సిబ్బందికి కూడా ఇబ్బందికరంగా మారింది. గ్యారేజ్ సెంటర్ నిర్వాహకులు, దుకాణదారులు చెత్తను సిబ్బందికి నేరుగా అందిస్తే నిర్వహణ మరింత మెరుగుపడే అవకాశం ఉంది.

సుప్రీం కోర్టు న్యాయమూర్తికి సత్కారం


జస్టిస్ గవాయిని సన్మానిస్తున్న గోపీచంద్

తిరుపతి లీగల్ : సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిని తిరుపతి న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు గోపీచంద్ శనివారం ఘనంగా సన్మానించారు. శ్రీవారి దర్శనార్థం వచ్చిన న్యాయమూర్తిని రేణిగుంట విమానాశ్రయంలో వారు కలిశారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కీర్తి శేఖర్ పాల్గొన్నారు.

108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలి


మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ గండికోట నాగ వెంకటేష్

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో 108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. 108 సర్వీసు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఎం నగర కార్యదర్శి టీ.సుబ్రమణ్యం, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గండికోట నాగ వెంకటేష్, సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి బీ.వేణుగోపాల్, 108 ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు కే.మహేష్, ఆర్.మునిరాజ పాల్గొని ప్రసంగించారు. 108 ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిపై వారు మండిపడ్డారు. ఒక్కొక్క ఉద్యోగి రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు నష్టపోతున్నారని వాపోయారు.సునీల్, లవకుమార్, ముని, భానుచంద్ర, యుగంధర్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



ఆదిత్య రామ్, ఎంపీ గురుమూర్తి

తిరుమల : తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో ఎంపీ గురుమూర్తి, ఐఏఎస్ అధికారి పోలా భాస్కర్, సినీ నిర్మాత ఆదిత్య రామ్, నటుడు రాజా గౌతమ్, తెలంగాణ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

యూటీఎఫ్ నగర కార్యవర్గం ఎన్నిక


హేమాద్రిబాబు, ఖాదర్‌బాషా, ప్రభుకుమార్

తిరుపతి ఎడ్యుకేషన్ : పెద్దకాపు వీధిలోని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) కార్యాలయంలో శనివారం నగర కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. గౌరవాధ్యక్షులుగా కె.వరలక్ష్మ, అధ్యక్షుడిగా వై.హేమాద్రిబాబు, సహాధ్యక్షులుగా ఎం.కృష్ణకుమార్, డాక్టర్ ఎం.నిర్మలబాయ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఖాదర్‌బాషా, కోశాధికారిగా వి.ప్రభుకుమార్, మహిళా కార్యదర్శులుగా పి.కవిత, పి.మారుతీదేవి, ఎం.ప్రసన్నలక్ష్మి, నగర కన్వీనర్‌గా బండి యామిని, సీపీఎస్ కన్వీనర్లుగా టి.గుణశేఖర్, వి.సునీత, బి.ప్రభాకర్‌రావు, ఫ్యామిలీ వెల్ఫేర్ స్కీమ్ కన్వీనర్‌గా పి.గోపాల్‌తో పాటు మండల కార్యదర్శులుగా మరో తొమ్మిది మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వర్సిటీలో గంజాయి ఆనవాళ్లు దారుణం

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీలో గంజాయి ఆనవాళ్లు కనిపించడం దారుణమని టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వర్సిటీలో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తిని కలసి గంజాయి కలకలంపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సరస్వతీ నిలయంలో ఇలాంటి ఘటనలకు తావు లేదన్నారు. మత్తుపదార్థాల వినియోగంపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరముందని కోరారు.

ఆయుర్వేద మందుల షాపులపై విజిలెన్స్ దాడులు


తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

తిరుపతి క్రైమ్: నగరంలోని ఆయుర్వేద మందుల షాపులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కరిముల్లషరీఫ్ ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. ఆయుర్వేద షాపులపై మూడు విభాగాలుగా అధికారులు విడిపోయి దాడులు చేపట్టారు. ఇందులో సరైన లైసెన్స్ లేకుండా, ఆయుర్వేద మందులతో పాటు, ఇంగ్లిష్ మందులు కూడా విక్రయిస్తున్నట్లు గుర్తించి ధన్వంతరి చికిత్సాలయం నిర్వాహకుడు రాఘవులుపై కేసు నమోదు చేశారు. లైసెన్స్ లేని అమృత ఆయుర్వేద షాపులను సీజ్ చేశారు. దాడుల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సుభాషిణి, ఆయుష్ డాక్టర్ విజయ్‌కుమార్, సీఐలు వెంకటరవి, చంద్రశేఖర్, ధనుంజయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంచు విష్ణు జన్మదినోత్సవం


కేక్ కట్ చేస్తున్న వీసీ నాగరాజ రామారావు

చంద్రగిరి : మోహన్‌బాబు యూనివర్సిటీ ప్రో చాన్సలర్, మా అధ్యక్షుడు మంచు విష్ణు పుట్టిన రోజు వేడుకలను శనివారం వర్సిటీలో ఘనంగా నిర్వహించారు. వీసీ రామారావ్ ఆధ్వర్యంలో ఎంబీ బ్లాకు వద్ద విద్యార్థులతో కలసి కేక్ కట్ చేశారు. వారు మాట్లాడుతూ చిన్న వయసులోనే మంచు విష్ణు సమాజం పట్ల అవగాహనతో పాటు యూనివర్సిటీ నిర్వహణలో పలు మార్పులు తీసుకువచ్చారని ప్రశంసించారు.

'మహా'విజయంపై సంబరాలు

తిరుపతి గాంధీ రోడ్ : మహారాష్ట్ర ఎన్నికల్లో మహాయుతి విజయం సాధించడంపై బీజేపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. శనివారం ఉదయం ఈ మేరకు బీజేపీ నేతలు చంద్రారెడ్డి, గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని, ఎన్డీఏ కూటమిని ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో నేతలు పాటిబండ మురళి, జనార్ధన్ రెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, సుబ్రమణ్యంయాదవ్, మస్తాన్, విగ్రహాల కల్యాణి, జయంత్ కుమార్, సూర్య ప్రకాష్, దేవరాజ్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికే పరిశోధనలు


పంటలను పరిశీలిస్తున్న డాక్టర్ సత్యనారాయణ

తిరుపతి సిటీ : రైతు సంక్షేమానికే పరిశోధనలు చేపట్టాలని, వాటి ఫలితాలను సక్రమంగా అందించాలని పరిశోధనా సంచాలకుడు డాక్టర్ పాలడుగు సత్యనారాయణ సూచించారు. శనివారం ఆర్ఏఆర్ఎస్‌లో ప్రయోగాత్మకంగా చేపట్టిన ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న పంటలను శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు సలహాలు అందించాలని కోరారు. అనంతరం అగ్రికల్చరల్ కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన బీఎస్సీ విద్యార్థులు ఏర్పాటు చేసిన దీక్షా ఆరంభ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పెరుమాళ్లపల్లెలోని వ్యవసాయ పరిశోధనా క్షేత్రాన్ని సందర్శించారు. ఏడీఆర్ డాక్టర్ సుమతి పాల్గొన్నారు.

రేపు ఎస్వీయూలో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ గోష్ఠి

తిరుపతి కల్చరల్: ఎస్వీయూ సెనేట్ హాల్లో సోమవారం ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ గోష్ఠి సభ నిర్వ హించనున్నట్టు శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ తెలుగు విభాగం ఆచార్యుడు బాలసుబ్రమణ్యం తెలిపా రు శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. నవంబర్ 24న మనదేశం సినిమా ద్వారా ఎన్టీఆర్ చిత్రసీమలో ప్రవేశించారని, ఈ సందర్భంగా వజ్రోత్సవ గోష్ఠి చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఔషధ నిపుణుల ర్యాలీ

తిరుపతి తుడా: జాతీయ ఫార్మసీ వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఔషధ నిపుణులు భారీ ర్యాలీ నిర్వహించారు. బాలాజీ కాలనీలోని ఉన్నత పాఠశాల నుంచి టౌన్ క్లబ్, మహతి ఆడిటోరియం, భవానీనగర్ కూడలి మీదుగా పాలిటెక్నిక్ వరకు ర్యాలీ కొనసాగింది. శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ అప్పారావు, డాక్టర్ ప్రశాంత్, అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, శ్రీపద్మావతి విద్యా సంస్థల అధినేత సులోచన, డైరెక్టర్ ప్రణీత్, డాక్టర్ రంగనాయకులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో బ్రూసెల్లోసిస్‌పై శిక్షణ


సర్టిఫికెట్లు అందుకున్న వారితో వైద్యాధికారులు

తిరుపతి తుడా : శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) క్లినికల్ వైరాలజీ విభాగం ఆధ్వర్యంలో 3వ వార్షికోత్సవ బ్రూసెల్లోసిస్, సెరోలాజికల్, మాలిక్యులర్ దయాగ్నొసిస్‌పై శుక్రవారం స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ రెండు రోజుల శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లినికల్ వైరాలజీ నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఉషాకళావత్ మాట్లాడుతూ నేషనల్ వన్ హెల్త్ ప్రోగ్రామ్ ఫర్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ జూనోసెస్‌తో కలిసి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. బ్రూసెల్లోసిస్ అనేది జంతువుల నుంచి మానవులకు సంక్రమిస్తుందని తెలిపారు. దీన్ని రక్త, మూత్ర పరీక్షల ద్వారా గుర్తించి చికిత్స చేయవచ్చన్నారు. అనంతరం పలువురికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. వైరాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ అంజువర్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.రామక్రిష్ణ, డాక్టర్ మాధవి, డాక్టర్ భూపతి రాజు, డాక్టర్ యశ్వంత్, డాక్టర్ గాయత్రి పాల్గొన్నారు.

త్వరితగతిన డ్రైనేజీల నిర్మాణం


డ్రైనేజ్ పనులు పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా : నగరంలో డ్రైనేజీల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. శనివారం లీలా మహల్ కూడలి, కరకంబాడి మార్గం, కొర్లగుంట కూడలి, బ్లిస్ కూడలి, తదితర ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న మురుగునీటి కాలువలను ఆమె పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ కాలువల్లో పేరుకుపోయిన మురుగు, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని స్పష్టం చేశారు. రోడ్లపై గుంతలు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ శ్యామ్‌సుందర్, స్మార్ట్ సిటీ ఈఈ చంద్రశేఖర్, ఎంఈ తులసి కుమార్, డీఈలు రాజు, రమణ, లలిత, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

యాంటీబయాటిక్స్ వాడకంపై అవగాహన

తిరుపతి తుడా: యాంటీ బయాటిక్స్ వాడకంపై అవగాహన ఉండాలని, అదుపు లేకుండా వాడితే వాటి వల్ల వచ్చే జబ్బులను నయం చేసుకోవడానికి సరిపడే మందులు లేవని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీఏ. చంద్రశేఖరన్, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీ.రవిప్రభు తెలిపారు. శనివారం ఎస్వీ వైద్య కళాశాలలో సూక్ష్మ జీవశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ సూక్ష్మజీవి నాశక ఔషధ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. అనంతరం వారు యాంటీబయాటిక్ రెసిస్టెంట్ బ్యాక్టీరియాతో కలిగే అనర్థాలను వివరించారు. వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ డీఎస్ మూర్తి, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ రవిప్రకాష్, పీడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ మనోహర్ పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి


మాట్లాడుతున్న తిరుమలాచారి

తిరుపతి కల్చరల్ : విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతే లక్ష్యంగా కృషి చేస్తున్నామని స్వర్ణాంధ్ర విశ్వకర్మ, విశ్వ బ్రాహ్మణుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలాచారి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. దేవాలయ కమిటీల్లో విశ్వకర్మ బ్రాహ్మణులకు ప్రభుత్వం అవకాశం కల్పించాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే వంశీకృష్ణ అసెంబ్లీలో ప్రతిపాదించడం అభినందనీయమన్నారు. సమావేశంలో సంఘం నేతలు రామచందాచారి, శ్రీమంతుల రామయ్య, మోహనాచారి, విజయాచారి, ప్రసాద్, మురళీ ఆచారి, నాగార్జునరావు, గోవిందాచారి, శంకరాచారి, రాజశేఖర్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల హర్షం

ఆలయ కమిటీల్లో విశ్వబ్రాహ్మణులకు స్థానం కల్పించాలని అసెంబ్లీలో ప్రతిపాదించడంపై రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చేజర్ల మనోహరాచారి హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమరాల్డ్ అచీవర్ ఆఫ్ ది ఇయర్‌గా మోహిత


అవార్డు అందిస్తున్న కళాశాల యాజమాన్యం

తిరుపతి సిటీ : ఎన్‌జీసీ రోడ్డులోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల శనివారం ఎలివేట్–2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజినెస్ క్విజ్, పికాసో, స్పీకప్, స్టాక్ బజ్, బిజినెస్ ప్రపో/జల్, జిక్స్‌యార్డ్ వంటి అంశాలపై డిగ్రీ విద్యార్థులకు పోటీలు చేపట్టారు. అన్ని అంశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థిని మోహిత ప్రతిభను కనబరచి అచీవర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును సొంతం చేసుకుంది. కళాశాల సంచాలకులు గిరిధర్, విశ్వనాథ్ మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలపేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఉప సంచాలకుడు మునిరత్నం, ప్రిన్సిపల్ జాఫర్‌వలీ, రమేష్, నరసింహ పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్


నిందితుడి అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

చంద్రగిరి: బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ఫణీంద్ర తెలిపారు. మండల పరిధిలోని మామండూరుకు చెందిన చెంచయ్య నాయుడు నిబంధనలకు విరుద్ధంగా బెల్టు దుకాణం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు శనివారం ఎస్ఐ సుధాకర్ తన సిబ్బందితో కలసి దాడులు చేపట్టగా.. 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని చెంచయ్య నాయుడును అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాలలో సైబర్ నేరాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు విభాగం అడిషనల్ ఎస్పీ లా అండ్ ఆర్డర్ రవిమనోహర్ ఆచారి మాట్లాడుతూ కొన్ని సందర్భాల్లో నేరాలు జరిగినప్పుడు, కొన్ని ముఖ్య సూత్రాలను పాటించాలన్నారు. గత కొద్ది రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా అనూహ్యంగా డిజిటల్ అరెస్టుల సంఖ్య పెరుగుతోందన్నారు. ఏమాత్రం అనుమానం వచ్చినా స్థానిక పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళా డీఎస్పీ శ్రీలత మాట్లాడుతూ వీటికి అడ్డుకట్ట పడాలంటే బ్యాంక్ లతో పాటు పబ్లిక్ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏమాత్రం అనుమానం వచ్చినా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్యవిద్య సంచాలకులు, ప్రిన్సిపల్ పీఏ.చంద్రశేఖరన్, ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ డీఎస్ఎన్ మూర్తి, డాక్టర్ సునీత, అన్ని విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం


మొక్క నాటుతున్న ప్రిన్సిపల్ నారాయణమ్మ

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నారాయణమ్మ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఎన్‌సీసీ అధికారి సుహాసిని, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ భద్రమణి, వార్డెన్లు హేమలత, నాగపద్మ, సాయికుమారి, డాక్టర్ లక్ష్మి పాల్గొన్నారు.